

సహకార కేంద్ర బ్యాంకు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సహకార కేంద్ర బ్యాంకు 2025 క్యాలెండర్‌ను చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులు, ఖాతాదారులు, సహకార బ్యాంకు ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025లో చిత్తూరు సహకార కేంద్రబ్యాంకు నూతన పథకాలతో సాంకేతికతను అందిపుచ్చుకొని బ్యాంకు పురోభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు. బ్యాంకు సిఈవో మనోహర్ గౌడ్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెసి విద్యాధరి

'యువగళాని'దే అధికారం..!

- 'కూటమి'లో నామినేటెడ్ కలవరం
- రౌండప్-2024



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కూటమి 2024 ఎన్నికల్లో విజయదుందుభి మోగించింది. 2019 ఎన్నికల్లో చతికిలపడ్డ టిడిపి 'యువగళం' యాత్రతో విజయం దిశగా అడుగులు కుప్పం నుంచి వేసింది. తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాలో 2019లో కుప్పంలో నారా చంద్రబాబునాయుడు తప్ప మిగిలిన 13 నియోజకవర్గాల్లోనూ వైసిపి స్వీప్ చేసింది. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో రివర్స్ అయ్యింది. 14 నియోజకవర్గాల్లోనూ ఒక్క పుంగనూరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మినహాయించి, 13 నియోజకవర్గాల్లో టిడిపి కూటమి స్వీప్ చేసింది. తిరుపతి నియోజకవర్గంలో జనసేన తరపున ఆరణి శ్రీనివాసులు పోటీచేసి గెలుపొందారు. చిత్తూరు ఎంపి దుగ్గుమళ్ల ప్రసాద్ కాగా, తిరుపతికి వైసిపి ఎంపి మద్దిల గురుమూర్తి హవా కొనసాగింది. రెండు జిల్లాల్లోనూ అధికార పార్టీకి మంత్రి పదవులు వస్తాయని ఆశించారు. అయితే కుప్పం నుంచి గెలుపొందిన నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారు తప్ప, జిల్లాకు నామినేటెడ్ పదవుల్లో నిరాశే మిగిలింది.

ప్రజా సమస్యలే అజెండాగా పోరాటాలు

2024 సంవత్సరంలో జిల్లాలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాసమస్యలే అజెండాగా పోరాటాలు నిర్వహించడం జరిగింది. ప్రధానంగా స్కీం వర్కర్లపై వేధింపులు నిరసనగా జిల్లాలో పెద్ద ఎత్తున పోరాటం చేయడం జరిగింది. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం 42 రోజులు సమ్మెలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్బంధాలను ఎదిరించి పోరాటం చేసిన కార్మికులకు సిపిఎం అండగా నిలబడింది. కుప్పంలో అకారణంగా ఇద్దరు కార్మికులను తొలగిస్తే వారికి అండగా నిలబడింది. ఇంటింటికీ సిపిఎం పేరుతో ప్రజాసమస్యలను అధ్యయనం చేసి ఆ సమస్యలపై పోరాటం చేయడం జరిగింది. చిత్తూరు నగరంలో నీవానది బాధితులకు అండగా ఉంటూ వారికి రక్షణ కల్పించాలని ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని పోరాటం చేయడంతో మొన్న జరిగిన ఎన్నికలలో సిపిఎం అజెండానే అన్ని రాజకీయ పార్టీలు వారి వారి ప్రణాళికలో పెట్టడం జరిగింది. మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేయడం జరిగింది. నగిరి ప్రాంతంలో వేలాదిమంది ఉన్న పవర్ లూమ్ కార్మికులకు తమిళనాడు తరహాలో 500 యూనిట్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని పెద్ద ఎత్తున పోరాటం చేయడం జరిగింది. పలమనేరు, బంగారుపాలెం తదితర ప్రాంతాల్లో పేదల భూములు ఆక్రమించుకున్న వాటిపై పోరాటం చేసి పేదలకు అండగా సిపిఎం నిలబడింది. మొగిలి యానాదుల భూములు కాపాడాలని పోరాటం చేయడంతో కలెక్టర్ ప్రత్యేకంగా సర్వే చేయించి వాటిని కాపాడే ప్రయత్నం చేయడం జరిగింది. బోయకొండ అభివృద్ధి పేరుతో నష్టపోయిన బాధితులు అండగా వారి సమస్యలు పరిష్కరించాలని పోరాటాల చేయడం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా జనరల్ బాడీలో తీర్మానం లేకుండా అక్రమంగా వీఓఏలను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులకు అండగా నిలబడి పోరాటాలు చేయడం జరిగింది. జిల్లాలో ప్రజాఉద్యమాలు చేస్తున్న ప్రజాసంఘాలకు ప్రజలకు సంపూర్ణ మద్దతు ఇచ్చి అండగా ప్రత్యక్ష మద్దతు ఇచ్చింది. కార్మిక రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తున్న కార్మికులకు రైతులకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. జిల్లాలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర అమలు చేయాలని డిమాండ్ చేసింది. జిల్లాలో దళితులపై దాడులు చేసిన వారికి అండగా ఉంటూ అగ్రకులస్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. యాదమరి -గుడియాత్తం అంతర్రాష్ట్ర రోడ్డును మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని ప్రత్యక్ష పోరాటం చేయడం జరిగింది. డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని జానపద వృత్తి కళాకారులకు కాణిపాకంలో రెగ్యులర్‌గా కార్యక్రమాలు ఇవ్వాలని పోరాటం జరిగింది. ఇలా జిల్లాలోని ప్రజాసమస్యలపై శక్తి మేరకు పోరాటం చేస్తూ భవిష్యత్తు పోరాటాలకు పదును పెడుతూ మననే జిల్లా మహాసభలు జరుపుకొని జిల్లావ్యాప్త ఉద్యమాలకు ప్రణాళిక నిర్ణయించుకొని నూతన సంవత్సరంలో సమస్యల పోరాటాలకు సిద్ధం అవుతున్నది. జిల్లా ప్రజానీకానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ సిపిఎం నూతన సంవత్సరంలో చేయబోయే ప్రజాపోరాటాల్లో ప్రజలందరూ భాగస్వాములు సమస్యలు పరిష్కారం చేసే దిశగా స్పందించాలి..

భూ సమస్యలపై వినతుల వెల్లువ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రెవెన్యూ సమస్యల పరిష్కారం పేరిట ప్రభుత్వం నెల రోజులకు పైగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. కొన్ని మండలాల్లో జనవరి 5 తేదీకి ఈ సదస్సులు ముగియనున్నాయి. జిల్లా వ్యాప్తంగా జనవరి 8వ తేదీ నాటికి రెవెన్యూ సదస్సులు పూర్తికానున్నాయి. ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో శ్మశాన వాటికల ఆక్రమణలు, దారి సమస్యలు, ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల స్థలాలు కాజేస్తున్నారు. రెవెన్యూ అధికారులు లెక్కలు తారుమారు చేసి భూ స్వాములు, పెత్తందార్లకు వత్తాసు పలుకుతూ పేదలకు అన్యాయం చేస్తున్నారనే ఫిర్యాదులు అంతున్నాయి. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలకు కూడా రెవెన్యూ సమస్యలే అధికం జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఈనెల 28వ తేదీ నాటికి 607 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఒక్క 28వ తేదీనే 571 ఫిర్యాదులు అందాయి. మొత్తంగా 28,815 రెవెన్యూ సమస్యలు జిల్లా వ్యాప్తంగా అందాయంటే రెవెన్యూ సమస్యలు జిల్లాలో ఏ మేరకు పెరుకుపోయో అర్థం చేసుకోవచ్చు.

సోమవారం జిల్లా కలెక్టరేట్ కొత్త స్పందన హాల్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా యాదమరి, గంగాధర నెల్లూరు, వెదురుకుప్పం, చిత్తూరు మండలాలకు చెందిన ప్రజలు, భూ సమస్యలు, శ్మశానానికి దారి, భూ సర్వే, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం, పింఛన్ వంటి సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. అలాగే పుంగనూరు, పులిచెర్ల, నగరి, వెదురుకుప్పం మండలాల నుంచి భూసమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

పిజిఆర్ఎస్‌కు 169 అర్జీలు

పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి అధికారులు పనిచేయాలని, ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. అర్జీలు రీఓపెన్ అయితే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 136, పంచాయతీ రాజ్ 3, పోలీసుశాఖ 10, డిస్ట్రిక్ట్ రిజిస్టర్ 2, ఏపిఎస్‌పిడిసిఎల్ 2, స్కిల్ డెవలప్మెంట్ 1, డిఆర్‌డిఏ 8, ఏపిఎస్ ఆర్‌టిసి 1, ఎంపిడిఓ పూతలపట్టు 1, ఎంపిడిఓ యాదమరి 1, హౌసింగ్ 3, డిటిడబ్ల్యూఓ 1, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు సమస్యలను తెలియజేశారు.

శ్మశాన వాటికి దారి సమస్య పరిష్కరించండి

యాదమరి మండలం నరాఊరు దళితవాడకు సంబంధించి శ్మశాన వాటికకు వెళ్లడానికి దారిలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని గతంలో కూడా మూడుసార్లు స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇవ్వడం జరిగిందని, తమ సమస్యలను పరిష్కారం చేయడం లేదని తమపై దయవుంచి శ్మశానానికి వెళ్లడానికి దారి, సర్వే చేసి హద్దులు గుర్తించాలని కోరుతూ దళితవాడకు చెందిన మహిళలు కోరారు.



శ్మశాన వాటికకు దారి సౌకర్యం కల్పించాలని కోరుతున్న మహిళలు

సెటిల్మెంట్ భూమి కబ్జా


గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లి గ్రామం దళితవాడకు చెందిన ధనమ్మ తనకు తెలీకుండా 37 సెంట్లు సెటిల్మెంట్ భూమిని అగ్రకులస్తులు వేరే వ్యక్తులకు అమ్మడం జరిగింది. తమ భూమిని తనకు తెలీకుండా అమ్మారని, తనకు న్యాయం చేయాలని తహశీల్దార్‌కు పలుమార్లు విన్నవించుకున్నా న్యాయం జరగలేదని కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించాలని కోరింది.

సర్వే నెంబర్ ఇవ్వండి

వెదురుకుప్పం మండలం చిన్న నక్కలాంపల్లి గ్రామానికి చెందిన బి.నీలవతికి సంబంధించి ఎకరా 18.08 సెంట్లు భూమికి సంబంధించి సర్వే నెంబరు లేదని, సర్వే చేసి సర్వే నెంబరు, హద్దులు గుర్తించి ఇవ్వాలనికోరుతూ అర్జీని అందజేసింది.

తల్లిదండ్రులు లేరు ఆదుకోండి

వెదురుకుప్పం మండలం, వెదురుకుప్పం పంచాయతీ సిఆర్.కండ్రిగ గ్రామానికి చెందిన చరణ్, చందు అనే ఇద్దరు విద్యార్థులు వెదురుకుప్పం జడ్పీ హై స్కూల్‌లో చదువుతున్నారు. వీరికి తల్లిదండ్రులు అనారోగ్యంతో మరణించారు. దీంతో వారు అనాథలుగా మారారు. తమకు ఎటువంటి ఆదాయం లేదని తమ అమ్మమ్మ దగ్గర ఉంటున్నామని ప్రభుత్వం సాయం అందించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.



అర్జీ ఇస్తున్న చరణ్, చందు

ప్రజల అర్జీలను పరిష్కరించాలి

నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు అందించిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. గతవారం అందిన అర్జీల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇంజనీరింగ్ విభాగం 2, ఫించన్లు 1 మొత్తం మూడు వినతులు అందాయి. సహాయ కమిషనర్ ఎ. ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

అమిత్ షా రాజీనామా చేయాలి

వామపక్షాలు, ప్రజాసంఘాలు డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామ చేయాలని సోమవారం వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శిలు వాడ గంగరాజు, ఎస్.నాగరాజు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అభిమానించే వారిని ఎగతాళి చేస్తూ అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందని ఆ జపం ఏదో దేవుడిని తలుచుకుంటే స్వర్గమన్న వచ్చేదంటూ అత్యంత అభ్యంతరమైన వ్యాఖ్యలను అమిత్ షా చేయడం దుర్మార్గమన్నారు. బాధ్యతాయుతమైన దేశ హోం మంత్రిగా ఉంటూ ఈ విధంగా మాట్లాడడం శోచనీయమన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఆగ్రహావేషాలు పెళ్లుబిక్కిన, నిరసనలు వెల్లువెత్తిన అమిత్ షాను ప్రధాని మోడీ వెనకేసుకు రావడం భారతీయులకు తలవంపు అని అన్నారు. ఇలాంటి మతోన్మాదశక్తులు అధికారంలో ఉండడం దేశానికి ప్రమాదకరమన్నారు. మతోన్మాద శక్తులరా ఖబడ్దార్.. మా దేహం ముక్కలైన దేశాన్ని కాపాడుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు సురేంద్రన్, గిరిధర్ గుప్తా, ఓబులురాజు, ఈశ్వరయ్య, లోకనాథం, సిపిఐ నాయకులు విజయగౌరి, కుమారి, దళిత సంఘాల నాయకులు దామోదరం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

యంత్రాలతో ఉపాధి పనులు

- పట్టించుకోని జిల్లా అధికారులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని గొల్లచీమనపల్లి పంచాయతీ పరిధిలో గల సుబ్బరాయుడు చెరువులో ఉపాధి హామీ పనులను యంత్రాలతో చేయిస్తూ అధికారులు ఉపాధి కూలీల కడుపు కొడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సుబ్బరాయుడు చెరువులో గతంలో ఉపాధి హామీ కూలీలు పనిచేసిన స్థానంలోని మళ్లీ జెసిబిల సహాయంతో పని చేసుకొని కొంతమంది పంచాయతీ నాయకులు మస్టర్‌లో తప్పుడు పేరు రాసుకొని బిల్లులు చేసుకుని ప్రభుత్వ సొమ్మును సహా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే స్థానిక పంచాయతీలో 550 జాబ్ కార్డు 1270 మంది ఉపాధి కూలీలు ఉండగా వారికి పని కల్పించకుండా యంత్రాలతో పనిచేస్తూ అధికారుల కళ్లుగప్పి బిల్లులు స్వాహా చేస్తున్నారని, దీనిపైన జిల్లా అధికారులు స్పందించి దీనిపైన తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కూలీలు కోరుతున్నారు. తమకు పనులు కల్పించి మస్టర్ ద్వారా బిల్లులు ఇవ్వాల్సిన అధికారులు యంత్రాలతో పనులు చేయించుకుంటూ తమకు జీవనోపాధి లేకుండా చేస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయంకు సంబంధించి ఏపీఓ హరినాథ్ విచారణ కోరగా నాయకులు చెప్పిన విధంగానే నడుచుకుంటున్నామని, పనులు జరుగుతున్నాయని తెలిపారు.



యంత్రాలతో పని చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలి

ఉపాధి హామీ చట్ట ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్

మండలంలోని గొల్లచీమనపల్లి పంచాయతీ పరిధిలో గల సుబ్బరాయుడు చెరువులో ఉపాధి హామీ పనులను యంత్రాలతో పనిచేయడం దారుణమని అలా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ఉపాధి హామీ పనిని నిర్లక్ష్యం చేస్తూ కూలీలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రతి బడ్జెట్లను ఉపాధి హామీకి నిధులు తగ్గించడం చూస్తే ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి అని అర్థమవుతోందని అన్నారు. ఉపాధి పనులకు యంత్రాలను ఉపయోగించడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి పనులను అన్ని గ్రామాల్లోనూ కల్పించి కూలీల ద్వారా చేయించాలని, వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉపాధి కూలీలను ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడులు

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదేనని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ తెలియజేశారు. ఆధునిక విద్యావిధానాలను పాటించి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని వారు సూచించారు. సోమవారం చిత్తూరు బిఎస్ కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యుల శిక్షణా తరగతుల కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ విద్యావిధానమే అన్నింటికీ మూలమని, ఈ నేపథ్యంలో విద్య విలువలను మరింతగా పెంపొందించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నారని చెప్పారు. అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ బడుల ప్రాధాన్యతను, వాటి గొప్పతనాన్ని నేటి తరం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. 75 ఏళ్ళ చరిత్ర కలిగిన ప్రభుత్వ బడుల మనుగడ ఎందుకు ప్రశ్నార్థకంగా మారిందని, ఈ విషయాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయన్నారు. దీని పై తల్లిదండ్రులు, అధ్యాపకులు దృష్టి సారించి ప్రభుత్వ విద్యాసంస్థలకు పూర్వవైభవాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు.



శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న ఎంపి, ఎమ్మెల్యేలు

ప్రశాంత వాతావరణంలో వేడుకలు: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. న్యూ ఇయర్ సందర్భంగా ప్రత్యేక మార్గదర్శకాలు పాటించాలంటూ సూచించారు. డిసెంబర్ 31 రాత్రి చిత్తూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా రోడ్ల వద్ద చెక్‌పోస్టులు, పికెట్‌లను ఏర్పాటు చేసి రాత్రి 10గంటల నుండి వాహనాలను తనిఖీ చేయడం ప్రారంభించి తెల్లవారు జామున వరకు కొనసాగించబడుతుందని తెలిపారు. వైన్‌షాపులు, బార్‌లను ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత సమయంలో మూసివేయాలన్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లు, ఫ్లైఓవర్‌లపై నూతన సంవత్సర వేడుకలు నిషిద్ధమన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో బ్రీత్ అనలైజర్ ద్వారా పట్టుబడిన వ్యక్తులను మేజిస్ట్రేట్ ముందుకు హాజరుపరిచి రిమాండ్‌కు పంపుతామన్నారు. హోటళ్లు, ఫంక్షన్ హాల్స్, ప్రైవేట్ స్థలాల నిర్వాహకులు ముందుగానే అనుమతి పొందాలని, అనుమతి లేకుండా నిర్వహించిన వారిపై చట్ట రీత్యాచర్యలు తీసుకోన్నట్లు హెచ్చరించారు. వేడుకల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, బాణసంచా లేదా పేలుడు పదార్థాలకు అనుమతి లేదని తెలిపారు. బహిరంగ మద్యపానం, ట్రిపుల్ రైడింగ్ పూర్తిగా నిషేధమని, మద్యం తాగి వాహనం నడిపినట్లయితే చట్టం ప్రకారం రూ.10,000 జరిమానా, 6 నెలల జైలు శిక్ష లేదా లైసెన్స్ రద్దు జరుగుతుందని, మైనర్లు వాహనం నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా రోడ్లపై ఎటువంటి కేక్ కటింగ్‌కు అనుమతి లేదని కేక్ కటింగ్ చేయాలనుకునే వారు తమతమ ఇళ్లలోనే వారి కుటుంబసభ్యులతో వేడుకలు చేసుకోవాలన్నారు. ప్రజల రక్షణార్థం డిసెంబర్ 31 రాత్రి అంతా బ్లూ కోల్ట్, రక్షక్ టీంలు రాత్రిళ్ళు గస్తీ నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎక్సైజ్, అగ్నిమాపక శాఖల అనుమతులు తప్పనిసరిగా పాటించాలని, వీటిని అమలు చేయడంలో సహకరించి నూతన సంవత్సరాన్ని అందరూ ప్రశాంతంగా జరుపుకుందామని అన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగిన డయల్ 100/112 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా చిత్తూరు పోలీస్ వాట్సాప్ నెంబర్‌కు 94409 00005 ఫిర్యాదు చేయాలని కోరారు.



ఈవిఎం గోదాము వద్ద పటిష్ట భద్రత: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈవిఎం గోదాము వద్ద నిరంతరాయంగా భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవిఎం గోడౌన్‌లో ఈవిఎంలను భద్రపరచిన తీరును కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవిఎంలను భద్రపరచిన గోడౌన్‌లో భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈవిఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాడ్‌ల భద్రత గురించి గోడౌన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో డిఆర్‌ఓ మోహన్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి సురేంద్ర కుమార్, వైసిపి ఉదయ్ కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్-పరదేశి, సిపిఎం వాడ గంగరాజు, బిజెపి అట్లూరి శ్రీనివాసులు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్ పాల్గొన్నారు.



ఈవిఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

స్నేహం గొప్పదనాన్ని చాటిన ఎంపి



స్నేహితులతో మాట్లాడుతున్న చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు స్నేహానికి ఉన్న గొప్పదనాన్ని చాటారు. ఎంపీగా కర్తవ్య నిర్వహణతో పాటు సేవాభావానికి క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారు. బాపట్ల జిల్లా బాపట్ల మండలం బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో నివసించే తన మిత్రుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బి.రత్నరాజును పరామర్శించి స్నేహం గొప్పదనాన్ని తెలియజేశారు. ఆపదలో ఉన్న స్నేహితుడిని కలిసి మిత్రధర్మాన్ని పాటించారు. మిత్రుడి ఆరోగ్య విషయాలు, ప్రస్తుతం ఆయన పరిస్థితులను ఆరా తీసి మిత్రుడి కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను సైతం అడిగి తెలుసుకుని అండగా ఉంటానన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలలో

ప్రతిభ చూపిన విద్యార్థి



సిల్వర్ మెడల్ ట్రోఫీతో అనీషా

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అనీషా గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలలో చిత్తూరు జిల్లా జట్టులో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపించింది. పోటీలో చిత్తూరు జిల్లా జట్టు ద్వితీయ స్థానాన్ని పొందింది. అనీషా జట్టులో పాల్గొని తన క్రీడా ప్రతిభను చూపి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. విద్యార్థిని అనీషా పాఠశాలకు మండలానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం ఎంతో గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు నిరంజన్ రెడ్డి తెలిపారు. పిడి శివకుమార్ పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు

యాదమరి విద్యార్థులు



ప్రజాశక్తి- యాదమరి: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు యాదమరి విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు రవి తెలిపారు. ఈనెల 28, 29లో 10వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు కాకినాడలోని లక్షా ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించారు. యాదమరి ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థిని జీవిత ఈపి విభాగంలో సిల్వర్ మెడల్, విద్యార్థిని మోనిశ్రీ, ధరణి పాయల్, ఈపి విభాగంలో బ్రాంచ్ మెడల్స్ గెలుపొందారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జనవరి 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జాతీయస్థాయి పోటీలో ముగ్గురు విద్యార్థులు పాల్గొంటారని రవి తెలిపారు. విద్యార్థులకు హెచ్ఎం గిరి రాజారావు, హరికృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

చర్చిలో కన్వెన్షన్ హాల్ ప్రారంభం



చర్చిలో మాట్లాడుతున్న ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు: సిఎస్ఐ చర్చిని అధునాతనంగా తీర్చిదిద్దడం చాలా సంతోషంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సిఎస్ఐ చర్చిలో నూతనంగా నిర్మించిన కన్వెన్షన్ హాల్‌ను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చర్చిని అధునాతనంగా తీర్చిదిద్దడం సంతోషంగా ఉందన్నారు. అనేక సంవత్సరాలుగా ఈ చర్చిను చూస్తున్నానని, అభివృద్ధి చేయాలన్న కోరిక తీరిందన్నారు. క్రైస్తవ సోదరులకు ఏ అవసరం వచ్చినా మీ ముందు ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి మాట్లాడుతూ పుంగనూరులో ఎవరికి ఏ అవసరం ఉన్నా అందుబాటులో ఉంటానని తెలిపారు. మాజీ ఎంపీ రెడ్డప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాష, రాయలసీమ బిషప్ వరప్రసాద్, పాస్టర్ రాకేష్, రవికుమార్, భరత్ భూషణ్, రాజకుమారి, ఉదయ్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం


ప్రజాశక్తి - గుడిపల్లి : మండలంలో సోమవారం సామాజిక తనిఖీ బృందం సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించింది. మండల పార్టీ అధ్యక్షుడు బాబు నాయుడు మాట్లాడుతూ 2022 -23 సంవత్సరంకు గాను సామాజిక తనిఖీ నిర్వహించబడుతుందని కావున నిష్పక్షపాతంగా తనిఖీలు నిర్వహించి ఆయా గ్రామ పంచాయతీలకు లెక్కలను తెలియజేయాలని కోరారు. ఎస్ఆర్‌పి మల్లికార్జున మాట్లాడుతూ జనవరి 2 నుంచి 8వతేదీ వరకు పంచాయతీల్లో గ్రామసభలు జరుగుతాయని కావున ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పకుండా గ్రామాల్లో దండోరా వేసి జనం వచ్చే విధంగా చూడాలని తెలిపారు. అలాగే మండలంలో 10వ తేదీ బహిరంగంగా సామాజిక తనిఖీ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ దానయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి- కుప్పంరూరల్: కుప్పం పట్టణ పరిధిలో అంటువ్యాధులు ప్రబలకుండా పురపాలక సంఘం ముందస్తు చర్యలను చేపట్టింది. ఇప్పటికే పట్టణ పరిధిలో వారంలో రెండుసార్లు దోమల నివారణ మందులను పిచికారి చేస్తున్నట్టు పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. అయితే పట్టణ పరిధిలో విష జ్వరాలు ప్రబలుతున్న వేళ పురపాలక సంఘం అంటువ్యాధులను నివారించడానికి చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా దోమల నివారణ మందుల పిచ్చకారి పనులను ముమ్మరం చేసిందని కమిషనర్ తెలిపారు. సోమవారం పట్టణ పరిధిలోని కొత్తపేట, నేతాజీరోడ్డు, కుమ్మరవీధి, దొమ్మరవీధి ప్రాంతాలలో దోమల నివారణ మందులను పిచ్చికారి చేశారు. ఈ పనులను కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ కమిటీ సభ్యులు కన్నన్, మురళి పరిశీలించారు.

డైయింగ్ యూనిట్లను ఆపేందుకు

ఏకగ్రీవంగా ముందుకు వచ్చిన కౌన్సిలర్లు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడులున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): డైయింగ్ యూనిట్లను ఆపేందుకు కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ముందుకు వచ్చారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం, బడ్జెట్ సమావేశం నిర్వహించారు. తొలుత అధికారులు బడ్జెట్ వివరాలను, సర్వసభ్య సమావేశం అజెండాను చదివి వినిపించారు. అజెండాలో కానీ, బడ్జెట్ వివరాల్లోగానీ ఇతర ఏ అంశాల్లో గానీ సందేహాలుంటే చెప్పాలని కోరారు. వెంటనే కౌన్సిలర్ బీడీ భాస్కర్ మాట్లాడుతూ డైయింగ్ యూనిట్ల కారణంగా నగరి నాశనమై పోయిందన్నారు. నివాశితులందరికీ కిడ్నీ వ్యాధులు, సోరియాసిస్ అంటూ విచిత్రమైన వ్యాధులన్నీ వస్తున్నాయన్నారు. ఇతర ప్రాంతాల్లో పెద్ద వైద్యశాలలకు వెళ్లినా వారికి నగరి అని చెప్పగానే రసాయన నీటి కారణంగానే ఈ పరిస్థితి అంటున్నారన్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలని డైయింగ్ యూనిట్లపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు సమాధానమిస్తూ నగరి మున్సిపల్ పరిధిలో 18 భారీ డైయింగ్ యూనిట్లు గుర్తించామని వాటిలో రెండింటికి మాత్రమే అనుమతి ఉందన్నారు. ఏ డైయింగ్ యూనిట్ నిబంధనలు పాటించడం లేదని శుద్ధీకరించిన నీటిని విడుదల చేయడం లేదన్నారు. నగరిలో పలు ప్రాంతాల్లో నీటిని పరిశీలించామని అందులో జింక్, ఆర్సినిక్ కలిసి ఉన్నట్లు రుజువైందన్నారు. ఇది ధీర్ఘకాలిక వ్యాధులను కలిగిస్తుందన్నారు. దీంతో తప్పక డైయింగ్ యూనిట్లను మూసివేసేవరకు పోరాడుతామని కౌన్సిలర్లు ముందుకువచ్చారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ తనది కూడా నేత సామాజికవర్గమే అని నాకూ డైయింగ్ యూనిట్ ఉందన్నారు. అయితే కౌన్సిలర్లందరూ తీర్మానిస్తే తానూ కట్టుబడి ఉంటానన్నారు. అయితే ఇది వేగంగా నిర్ణయించే అంశం కాదన్నారు. కాకవేడు రెవెన్యూ సర్వే నెం. 12పిలోని 4.944 హెక్టార్ల విస్తీర్ణంలో జాతీయ రహదారి 205 వెడల్పుకు గ్రావెల్ తీసుకోవడానికి ఈకేకే ఇన్‌ఫ్రాస్టక్చర్ లిమిటెడ్ వారికి అనుమతి కొరకు కౌన్సిల్ ఆమోదం కోరడంపై కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫ్లోర్ లీడర్ దయానిధి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఎన్నో హెక్టార్ల గ్రావెల్ క్వారీలు ఇదివరలో ప్రైవేటు వ్యక్తులకు ఇష్టారాజ్యంగా ఇచ్చేసారని అప్పుడంతా కౌన్సిల్ అనుమతి ఎందుకు కోరలేదన్నారు. ఇప్పుడు అనుమతి అడగడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై కౌన్సిల్ రసాభసగా మారింది. ఈ అంశానికి కౌన్సిల్ ఆమోదం తెలపలేదు.

ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని మండల అభివృద్ధి అధికారి నారాయణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆధార్ సవరణల కోసం ప్రతిరోజు అధిక శాతంలో ప్రజలు కేంద్రానికి వస్తూ తమ ఆధార్ కార్డులో సవరణలు మార్పులు చేర్పులను చేసుకుని వెళ్తున్నారు. సిబ్బంది మార్పులు చేర్పులను ఏ విధంగా చేస్తున్నారని ఎంపిడిఓ ప్రజలతో మాట్లాడి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయంలోని రికార్డులను పరిశీలించి పన్నుల వసూలు, పారిశుధ్యం, తాగునీరు పూర్తిస్థాయిలో అందే విధంగా చూడాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి మజాహర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు



ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలో జోరుగా టిడిపి సభ్యత్వాల నమోదు జరుగుతుందని రూ.100లు కట్టి టిడిపిలో సభ్యత్వం పొందినట్లయితే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ హేమంబర్ గౌడు తెలిపారు. సోమవారం మండలంలో ఆయన టిడిపి నాయకులతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి- గంగవరం: కీలపట్ల గ్రామ పంచాయతీలోని మాదిగపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆదేశాల మేరకు బెంగళూరు ఎన్ఐఎఎస్‌పి సంస్థ పశువుల వైద్యులు తులసిరామ్ ఆధ్వర్యంలో పశువులకు దాణా పంపిణీ చేశారు. మాదిగపల్లి గ్రామంలో 40మంది రైతులకు దాణా పంపిణీ చేశారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థిని రేఖకు గంగవరం మండల జనసేన నాయకులు అండగా నిలిచారు. కాలేజీ ఫీజు కట్టలేక చదువు మానేసిన రేఖ కుటుంబ సభ్యులతో జనసేన మండల అధ్యక్షురాలు మంజుల చంద్ర మాట్లాడి తిరిగి కళాశాలలో చేర్పించారు. గత రెండు సంవత్సరాల ఫీజు బకాయిలను చెల్లించి మానవత్వం చాటుకున్నారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రమేష్, దాము, కవిశ్వర్, కృష్ణమూర్తి, శివకుమార్, రాజు పాల్గొన్నారు.

వీఆర్వోల మండల కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు మండలం వీఆర్వోల మండల కమిటీలను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో కమిటీ అధ్యక్షులుగా కొత్తపల్లి బాబు, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, కార్యదర్శిగా శోభారాణి, కోశాధికారిగా మాధవిని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వీఆర్వోల అభ్యున్నతికి సమస్యల పరిష్కారానికి నిత్యం అండగా ఉంటామని కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన



ప్రజాశక్తి- రొంపిచర్ల: మండల కేంద్రంలోని ఎర్రవారిపాలెం రోడ్డు, మల్లెల, గానుగ చింత వెళ్లే రోడ్డు గత కొన్ని సంవత్సరాలుగా గుంతలతో చాలా అధ్వానంగా తయారై వాహనాలు వెళ్లలేని పరిస్థితిలో ఉండేది ఈసమస్యను ప్రజలు నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే చల్లా బాబు స్పందించి రోడ్డ మరమ్మతు పనులు చేయించారు. రోడ్డు పనులు నాణ్యతగా జరగాలని పనులను పరిశీలించారు. రొంపిచర్ల సర్పంచ్ ఇబ్రహీం ఖాన్ పాల్గొన్నారు.

మైనార్టీ సమస్యలపై వినతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలం ప్రత్యేక కార్యక్రమానికి విచ్చేసిన మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషకు మండలంలోని మైనార్టీ నాయకులు షబ్బీర్ ఆధ్వర్యంలో మైనార్టీల సమస్యలు తెలిపి సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. అదే విధంగా మౌజాన్లకు అందిస్తున్న గౌరవ వేతనంపై హర్షం వ్యక్తం చేశారు. వారి వెంట అబ్దుల్లా, సోమ గోవిందస్వామి ఉన్నారు.

అధికారుల గ్రామసందర్శన

ప్రజాశక్తి- యాదమరి : ప్రజాసమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు రసూల్ నగర్ గ్రామానికి చెందిన రైతు దారి సమస్య పరిష్కరించాలని జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి, మండల తహశీల్దార్ పార్థసారథి, మండల అభివృద్ధి అధికారి వేణు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఈవోపీఆర్డి సుకుమార్ రెడ్డి, 122 కమ్మపల్లి గ్రామపంచాయతీలోని రసూల్ నగర్‌లోని రైతు ఫిర్యాదు మేరకు గ్రామాన్ని సందర్శించి దారి సమస్యపై నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందించనున్నారు.

భూ సమస్య పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న బాధితులు, నాయకులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలం పరిధిలోని దేవదొడ్డి యశోదమ్మ భూమి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎటుట జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు డి.వి.మునిరత్నం, పార్థసారథి మాట్లాడుతూ దేవదొడ్డి గ్రామంలో యశోదమ్మ భర్త కృష్ణప్పకు పూర్వికుల నుండి సంక్రమించిన భూమి దేవదొడ్డి రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 312/2ఎ, 312/2బి, 312/2సి, 310/3డిలో మొత్తం రెండు ఎకరాల భూమి భాగ పరిష్కారంగా సంక్రమించిందని తెలిపారు. కృష్ణప్ప చనిపోవడంతో యశోదమ్మ బిడ్డలను పిలుచుకొని బెంగుళూరు పట్టణానికి వలస వెళ్లిన అక్కడనుండి దేవదొడ్డి గ్రామంలో ఉన్న భూములను అప్పుడప్పుడు వచ్చి పరిశీలించుకుని వెళ్లే వారు కానీ యశోదమ్మ కొంతకాలంగా అనారోగ్య రీత్యా భూములు వద్దకు రాకపోవడంతో యశోదమ్మ మరిది వెంకటేష్ భూమి తన పేరున కొంత, తన భార్య పేరున కొంత భూమిని ఆన్లైన్లో అప్లోడ్ చేసుకున్నారని తెలిపారు. సమస్యపై పలుమార్లు యశోదమ్మ విఆర్ఓకు ఫిర్యాదు చేసిన, గ్రామపెద్దలకు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. రత్నమ్మ, సాంబశివ, గుర్రం సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, నాగార్జున, గాయత్రి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి- సోమల: మండలంలో సోమవారం నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవం సైన్సు ప్రదర్శనలు తూతూ మంత్రంగా జరిగాయి. మండల స్థాయి విద్యాశాఖ అధికారులు ఒక్కరోజు ముందుగా సైన్స్ నమూనాలను తయారు చేసుకొని మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రావాలని మండలంలోని ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలకు ఆదేశాలిచ్చినట్టు సమాచారం. తక్కువ సమయంలో ఆకట్టుకునే విధంగా ఆలోచన రేకెత్తిచ్చే విధంగా విద్యార్థులు నమూనాలు చేసుకు రాకపోవడంతో తూతూ మంత్రంగా సైన్స్ దినోత్సవం జరిగింది. మండలంలోని ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తాము తయారు చేసుకువచ్చిన నమూనాలను ప్రదర్శించారు. సమాజ అభివృద్ధికి సైన్స్ ఎంతో ఉపయోగపడుతుంది. సైన్స్ ద్వారా ఎన్నో నూతన ఆవిష్కరణలు సాంకేతిక విధానాలు కలుగుతాయి. సైన్స్ గురించి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించడం వారిచేత నమూనాలను తయారు చేయించి వాటిని ఇతర పాఠశాలల నుండి వచ్చే విద్యార్థులకు ఉపాధ్యాయులకు కూడా ఏ విధంగా ఉపయోగపడతాయో సవివరంగా విద్యార్థులు తెలియజేస్తూ సైన్స్ ప్రదర్శనలు నిర్వహిస్తూ ఉంటారు దీనివల్ల అటు విద్యార్థులకు ఇటు ఉపాధ్యాయులకు కూడా ఎంతో ఉపయోగపడతాయి. అలాంటిది తూతూ మంత్రంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది.



విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు

ఆయిల్ ఫామ్ సాగుతో అధిక దిగుబడులు



రైతులతో మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మామిడికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ తోటల సాగుతో రైతులు తక్కువ ఖర్చుతో తక్కువ శ్రమతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. సోమవారం ఎస్ఆర్ పురం మండలం వెలుగు సమావేశ మందిరంలో మామిడి రైతుల మామిడి తోటల పెంపకంలో సస్యరక్షణ అనే అంశంపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో మామిడి తోటలు పెంచి లాభాలు పొందారని ప్రస్తుతం మామిడి తోటల పరిస్థితి అంతంత మాత్రమేనని చీడపీడల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, మామిడి కి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆయిల్ ఫామ్ తోటలలో కోకో నీ అంతర్ పంటగా వేసుకోవాలన్నారు. కోకో చెట్లకు నేడు అవసరమని అరటి పంట వేసి దాని నీడలో కోకో వేసుకోవాలని సూచించారు. కోకో ఎగ్జిక్యూటివ్ మనోజ్ మాట్లాడుతూ కోకో పంట వల్ల రైతులకు వచ్చే ఆదాయాలను వివరించారు. కార్వేటినగరం మండలానికి చెందిన కోకో రైస్ మునిస్వామి రాజు కోకో పంట సాగులో తన అనుభవాలను పంచుకున్నారు. గంగాధర నెల్లూరు ఉద్యానవన శాఖ అధికారి లోకేష్, అమ్మ ఆయిల్ ఫామ్స్ ప్రతినిధి మహేష్ రైతులు పాల్గొన్నారు.

రైతులు కోకో పంటను సాగు చేసుకోవాలి
జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి

బంగారుపాళ్యం: రైతులు కోకో పంటను సాగు చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి సూచించారు. సోమవారం మండల కార్యాలయంలో మామిడి రైతులతో ఉద్యానవ శాఖ అధికారి సాగరిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మండల వ్యవసాయ ఉత్పత్తుల సంఘ అధ్యక్షులు నేతాజీ నాయుడు, వ్యవసాయ అధికారి చిట్టిబాబు, ప్రసాద్, పరిశ్రమ సిబ్బంది మనోజ్ పాల్గొన్నారు.

మహమ్మద్ తన్వీర్‌ను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అబాకస్ -యూసీ మాస్‌లో అంతర్జాతీయ స్థాయిలో మొదటి బహుమతి పొందిన మహమ్మద్ తన్వీర్‌ను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందించారు. సోమవారం జిల్లా సచివాలయంలో గ్రీవెన్స్ హాల్‌లో చిత్తూరు పాత ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్న జిక్రియా, సబీహ దంపతుల కుమారుడు శ్రీచైతన్యలో ఆరవ తరగతి చదువుతున్న మహమ్మద్ తన్వీర్ అబాకస్ యూసి మాస్ న్యూఢిల్లీలో డిసెంబర్ 16న నిర్వహించిన పోటీలలో అంతర్జాతీయ జాతీయ స్థాయిలో మొదటి బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా మహమ్మద్ తన్వీర్ తల్లిదండ్రులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలవగా తన్వీర్‌ను అభినందించి చదువులో ఇంకా బాగా రాణించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.



మహమ్మద్ తన్వీర్‌ను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

రీ సర్వే ప్రాజెక్టుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : భూముల రీసర్వే ప్రాజెక్టుపై తహశీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని వీఎన్ఆర్ పేట, సరస్వతి విలాసపురం ప్రాంతాల్లో రీసర్వే ప్రాజెక్టుపై ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన రీసర్వే ప్రాజెక్టు ద్వారా అన్ని గ్రామాల్లోను రీసర్వే పూర్తిచేస్తామన్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఆర్‌వీ ప్రసాద్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ గుర్రప్ప కోరారు. సోమవారం గ్రామసభల్లో భాగంగా వడ్డేపల్లి రెవెన్యూ పరిధిలోని బందార్లపల్లి గ్రామంలో రీసర్వే పై భారీ ఎత్తున రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సర్వే ద్వారా దీర్ఘకాలిక భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన వివరించారు. డీటీ మునికృష్ణ, మండల సర్వేయర్ చంద్రశేఖర్, వీఆర్వోలు రైతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: రెవెన్యూ సమస్యలపై కనికాపురం గ్రామంలో సోమవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి తహశీల్దార్ లోకనాథ పిళ్లై ఆధ్వర్యంలో రీసర్వే ప్రాజెక్టుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 23 గ్రామపంచాయతీలకు గాను 38 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి, ఇందులో ఆరు రెవెన్యూ గ్రామాలలో రీసర్వే జరిగిందన్నారు. పంచాయతీలో సమస్యలు ఉన్న గ్రామస్తులు, రైతులు అర్జీలు సమర్పించారని తెలిపారు.



ఎస్ఆర్ పురంలో..

తవణంపల్లి: మండల పరిధిలోని చెర్లోపల్లి రెవెన్యూ వెంగంపల్లి, చెర్లోపల్లి గ్రామంలో ప్రభుత్వ తహశీల్దార్ సుధాకర్ ఉత్తర్వులు మేరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ రీ సర్వే పైలట్ ప్రాజెక్టుపై డిటి వెంకటరమణ, సర్వేర్లు గిరి, మురళీకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వీఆర్వో హేమాద్రి, విలేజ్ సర్వేర్లు బాబు, శైలజ, షణ్ముగం, పాయని వేలు, ప్రశాంత్, బాలాజీ, భార్గవి, జయశ్రీ, సంధ్య, లీలాకుమార్, తేజశ్రీ పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: రైతులు దీర్ఘకాలిక ఎదుర్కొంటున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించిందని తహశీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. రైతులు భూసమస్యలపై అర్జీలను తహశీల్దార్‌కు అందజేశారు. ఆర్ఐ ఏకాంబరం, వీఆర్వో ప్రవీణ్, టిడిపి నాయకులు నియాజ్ అలీ, నీరజాక్షులరెడ్డి, శాంత్‌కుమార్, నరసింహులు నాయుడు, శంకర్ పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలో సోమవారం గుండ్లసాగరం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు టిఎం.బాబు నాయుడు మాట్లాడుతూ రైతులు ఇచ్చే అర్జీలను స్వీకరించి వెంటనే పరిష్కార మార్గాలు చూపించాలని రెవెన్యూ శాఖకు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ నాగరాజు, మాజీ ఎంపిటిసి ఉదయ్‌కుమార్, నాయకులు అమీర్, రామచంద్ర, మండల సర్వేయర్ రత్నప్ప పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మండలంలోని వీకేఆర్‌పురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హరినాయుడు (32) అనే వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తడుకుపేట ఎస్‌వీ పురం గ్రామానికి చెందిన హరినాయుడు మొలకెత్తిన విత్తనాలు, ఆర్గానిక్ జ్యూస్‌లు నగరి మున్సిపల్ పరిధిలోని పలు ఇళ్లకు, దుకాణాలకు సరఫరా చేస్తుంటాడు. యధావిధిగా సోమవారం సరఫరా నిమిత్తం మొలకెత్తిన విత్తనాలు తీసుకొని ద్విచక్రవాహనంలో వీకేఆర్‌పురం వద్ద గ్రామం నుంచి జాతీయ రహదారికి వచ్చిన సమయంలో రోడ్డుపై వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. మార్గమధ్యంలోనే హరినాయుడు తుది శ్వాస విడిచాడు.

కంటైనర్ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి- పూతలపట్టు: బెంగళూరు -నాయుడుపేట జాతీయ రహదారిలోని పి.కొత్తకోట వద్ద కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు పాకాల మండలం చెన్నుగారిపల్లి గ్రామానికి చెందిన రూప (27) ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుంది. సోమవారం ఉదయం కర్మకరానికి చెందిన బస్సు ఎక్కడానికి రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండలంలో నాకా బందీ

ప్రజాశక్తి- తవణంపల్లి : మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై చిరంజీవి నాకా బందీ నిర్వహించారు. వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించకూడదని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎస్సై సూచించారు. అనంతరం వాహనాలు తనిఖీ చేసి లైసెన్స్, హెల్మెట్ లేని వారికి జరిమానా విధించారు. ఏఎస్ఐ గజేంద్ర, మొగిలి రెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రెవెన్యూ డివిజన్ సేవలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గ ప్రజలకు రెవెన్యూ డివిజన్‌స్థాయి సేవలను పూర్తిగా అందించాలని కోరుతూ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, యువ నాయకులు సంతోష్‌తో కలిసి కడా పిడికి వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ వైసిపి హయాంలో కుప్పం నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చడం జరిగిందన్నారు. అప్పట్లో కుప్పం రెవెన్యూ డివిజన్ కేవలం కాగితాలికే పరిమితమైందన్నారు. వైసిపి హయాంలో రెవెన్యూ డివిజన్‌గా మారిన కుప్పం ప్రజలకు రెవెన్యూ డివిజన్ స్థాయి సేవలు మాత్రం అందడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కుప్పంలో అభివృద్ధి మొదలైందన్నారు.

పేదల జీవన ప్రమాణాలకు

అవరోధం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- యాదమరి: పేదల జీవన ప్రమాణాలకు అవరోధం కలిగించే ఎలాంటి వ్యక్తులైనా చట్టపరమైన చర్యలు తప్పవని యాదమరి తహశీల్దార్ పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం మాదిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో కులమతాలు భేదాలు లేకుండా అందరూ సమానమే అని, అన్ని వర్గాల ప్రజలందరూ సోదరభావంతో మెలగాలని వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని కోరారు. ఎస్సీ ఎస్టీల గ్రామాల్లో భూముల దారి ఆక్రమణలు వారి కుటుంబాల జీవన ప్రమాణానికి ఆటంకం కల్పిస్తే అలాంటి వారి సంబంధించి తమకు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. వారి జీవన ప్రమాణాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా పోలీసు రెవెన్యూ శాఖల సమన్వయంతో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం గ్రామంలోని దారి సమస్య, డ్రైనేజీలు, వీధిలైట్లు, వివిధ సమస్యలపై వినతి పత్రం అందించారు. ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ బాల, ఎస్సీ నాయకులు మురుగేషన్, కోడిగుట్ట రవి పాల్గొన్నారు.

మల్లేశ్వర స్వామి గుడిని సందర్శించిన చల్లా బాబు

ప్రజాశక్తి- రొంపిచర్ల: మండలంలోని కావేటిగారిపల్లిలో వెలసిన శ్రీమల్లేశ్వర స్వామి గుడిని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లేశ్వర స్వామి గుడికి కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రామనాథం నాయుడు, ధనుంజయ నాయుడు, నాగరాజు నాయుడు, మహేష్, ధనంజయ, గురుమూర్తి, రమేష్, నరేంద్ర, చంగల్రాయ నాయుడు, మురళి నాయుడు ఉన్నారు.

ఉదయం నుంచే పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి- సోమల: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం డిసెంబర్ 31వ తేదీనే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఉదయం 5.30గంటల నుంచి పింఛన్లు పంపిణీ ప్రారంభించాలని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఉచితంగా పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- కుప్పంటౌన్: ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రధాన గ్రంధాలయంలో సోమవారం ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి, కుల సచివులు ఆచార్య కిరణ్ కుమారులు పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విశ్వవిద్యాలయ పరిధిలో యూజీ, పీజీ, పరిశోదక విద్యార్థులకు 1500 పుస్తకాలను పంపిణీ చేసినట్టు డాక్టర్ కిషోర్ తెలిపారు.